గాడి తప్పిన నగర పాలన

- అధ్వానంగా పారిశుద్ధ్యం
- కలెక్టర్ చెప్పే వరకు స్పందించని కార్పొరేషన్ అధికారులు
- వాహనాలు ఉన్నా.. ప్రైవేటు చెత్త ట్రాక్టర్లు ఎవరికోసం ?
- బోగస్ ట్రిప్పుల నమోదు – డుమ్మా కొట్టే కార్మికుల నుంచి మామూళ్లు
- టెండర్లలో మాయజాలం – సిండికేట్ ద్వారా ఆదాయానికి గండి
- మెమోలకే పరిమితం – అంతకుమించి ముందుకు సాగని వైనం
- నేడు నగర పాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం



బుధవారపేటలోని ఓ వీధిలో అస్తవ్యస్తంగా చెత్తాచెదారం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థలో పాలన గాడి తప్పిందా? నిత్యం కిందిస్థాయి ఉద్యోగులకు మెమోలకే పరిమితమా? అన్ని విభాగాల్లో అవినీతి తాండవిస్తోంది. సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుంకేసులలో, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో ఫుల్‌గా నీళ్లు ఉన్నా.. శివారు కాలనీలకు నీళ్లు అందని పరిస్థితులు ఉన్నాయి. ఇక పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పర్యవేక్షణ లేక ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి నియోజకవర్గంలో వీధులు కంపు కొడుతున్నాయి. ఏళ్ల తరబడి తిష్ట వేసుకొని పనిచేయడం వల్లే ఈ శాఖలో సమస్యలు వస్తున్నాయి. అధికారులకు కోపమొచ్చినప్పుడల్లా అక్కడి నుంచి ఇక్కడికి.. ఇక్కడి నుంచి అక్కడికి మార్పులు చేయడం తప్పా.. మార్పు మాత్రం కనిపించడం లేదు. నిత్యం మెమోలు జారీ చేయడమే పనిగా పెట్టుకున్నారు. రూ.కోట్లలో బకాయిలు ఉన్నా చర్యల్లేవు. అధికారులను వదిలేసి సచివాలయాల ఉద్యోగులనే అన్నింటికీ టార్గెట్ చేస్తున్నారు. దీంతో పాలన గాడి తప్పిందన్న విమర్శలు ఉన్నాయి.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

నగరంలో పారిశుద్ధ్య లోపం తీవ్రంగా ఉంది. సిబ్బంది ప్రతిరోజూ పనులు చేస్తున్నారు. ఉద్యోగులు సంతకాలు చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. అయినా ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా మారింది. ఈ విభాగంలో పేరుకుపోయిన అవినీతి కారణంగా ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చక్రం తిప్పుతున్నారు. అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పారిశుద్ధ్య సమస్య వచ్చిన ప్పుడు మాత్రం సచివాలయాల ఉద్యోగులను బలి చేస్తున్నారు. ఏడాది క్రితం తాత్కాలిక పద్ధతిన 200 మంది పారిశుద్ధ్య కార్మికులను తీసుకున్నారు. రూ.2 కోట్ల నిధులు ఖర్చవుతున్నాయి. వీరిలో సగం మంది పనిచేయడం లేదు. మరికొంత మంది పర్మినెంట్ ఉద్యోగుల తరఫున బినామీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇవన్నీ అధికారులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. ట్రేడ్ లైసెన్సుల్లో పెద్ద అవినీతి జరుగుతోంది. షాపుల సంఖ్య నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంది. అయినా తనిఖీలు చేయరు. రూ.కోట్లలో బకాయిలు ఉన్నాయి. అయినా వసూలు చేయరు. మెమోలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇక పారిశుద్ధ్య విభాగంలో 12 ఆటోలు, 17 ట్రాక్టర్లు, 7 టిప్పర్లు, 5 బిగ్ కాంపాక్టర్లు, 10 మినీ కంపాక్టర్లు, 1 బిగ్ ట్రక్కు ఉన్నాయి. వీటి ద్వారా చెత్త తరలింపు చేస్తున్నారు. అయితే తక్కువగా ఉన్నాయన్న కారణంతో మరో 10 ప్రైవేటు చెత్త ట్రాక్టర్లను నియమించారు. వీటికి ఒక్కొక్క ట్రాక్టర్‌కు ట్రిప్పుకు రూ.2,300 ప్రకారం ప్రతి రోజు రెండు ట్రిప్పులకు అనుమతులు ఇచ్చారు. ఇప్పటికే బోగస్ ట్రిప్పుల పేరుతో నిధులు స్వాహా అవుతున్నాయన్న విమర్శలు స్వయాన డ్రైవర్లు వెల్లడించడం గమనార్హం. ప్రతి నెలా రూ.లక్షలు దుర్వినియోగం అవుతున్నాయి.

టెండర్లలో మాయాజాలం

టెండర్లలో నెల రోజుల క్రితం వరకు కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. టెండర్ ఉద్దేశం కూడ అదే. అయితే ఈనెల 11 వ తేదీ నిర్వహించిన టెండర్లలో మాయాజాలం కనిపించింది. పోటీ పడి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు సిండికేట్‌గా మారారు. పోటీ లేదు. పంచుకున్నారు. అంచనా విలువ కన్నా 0.09 నుంచి 1 శాతం వరకు మాత్రమే లెస్ వేసి పనులు దక్కించుకున్నారు. దీంతో నగరపాలక ఆదాయానికి గండి పడుతోంది. రాబోయే రోజుల్లో అంచనాల విలువకే పనులు దక్కించుకునే పరిస్థితి కనిపిస్తోంది. తొలిసారి ఎక్సెస్ పనులకు కూడా అధికారులు ఆమోదం వ్యక్తం చేయడం గమనార్హం.

నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

ఈనెల 2న వాయిదా పడిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. నగర మేయర్ బీవై.రామయ్య, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పది రోజుల క్రితం..

'స్వయాన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. వీధులు కంపు కొడుతున్నాయి. రోడ్లు దుమ్ము, దూళితో నిండి ఉన్నాయి. ఇవన్నీ కనిపించవా? అంటూ మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయండి. ఆరోగ్య శాఖ అధికారికి షోకాజ్ నోటీసులు ఇవ్వండని జిల్లా కలెక్టర్ చెప్పే వరకు మన అధికారులకు కనిపించలేదు. ముగ్గురు ఉన్నతాధికారులు నిత్యం కర్నూలు నగరంలో పర్యటిస్తున్నారు. అయినా ఎందుకు కనిపించలేదు?'

నెల రోజుల క్రితం...

■ గత నెల 15వ తేదీ ఎన్ క్యాప్ (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) కింద నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. స్థానిక ఐదు రోడ్ల కూడలి నుంచి బంగారుపేట సర్కిల్ వరకు రూ.50 లక్షలతో చేపడుతున్న సెంట్రల్ మీడియన్ పనుల కోసం 35 శాతం లెస్ వేసి పనులు దక్కించుకున్నారు.

■ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్ నుండి సీ.క్యాంపు రైతుబజారు వరకు పేవ్‌మెంట్ రోడ్డు కోసం రూ.50 లక్షలతో పిలిచిన టెండర్ పనులను పోటీ పడి 35 శాతం వరకు లెస్ వేసి పనులు దక్కించుకున్నారు.

ఇప్పుడు..

■ 19వ వార్డులోని మదర్‌ల్యాండ్ వద్ద రూ.49.50 లక్షలతో బీటీ రోడ్డు పనులను 0.09 శాతం లెస్‌తో పనులు దక్కించుకున్నారు.

■ 12వ వార్డు పరిధిలోని అబ్రర్ కాంప్లెక్స్ వద్ద రూ.25 లక్షలతో పిలిచిన టెండర్లలో సీసీ రోడ్డు పనులను 1.08 నామమాత్రపు లెస్ వేసి పనులు దక్కించుకున్నారు.

క్లుప్తంగా

నేర ప్రవృత్తిని వీడండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు, అన్ని పోలీసు స్టేషన్ల పరిధిల్లో నేరచరిత్ర కలిగిన వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

మహనీయులను స్మరించుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం ఓల్డ్‌సిటీ చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో కీ.శే. ఇంద్రకంటి వేంకటేశ్వర్లు రచించిన 'యుగపురుషుడు స్వామి వివేకానంద' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కొట్టే చెన్నయ్య పుస్తక సమీక్ష చేశారు. స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల కరస్పాండెంట్ ఎం.డి.వి. జోగయ్య శర్మ మాట్లాడారు. వివేకానంద కేంద్ర వ్యవస్థాపక ప్రముఖ్ శివప్రసాద్, విశ్రాంత అధ్యాపకులు ఎన్. శేషఫణి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల రక్తదానం



వైద్యులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న బ్రహ్మకుమారీలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని ఈశ్వర్‌నగర్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఏపీఎస్పీ స్పెషల్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అధిక సంఖ్యలో యువకులు, యువతులు, పెద్దలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయన్నారు. రక్తదానంపై అపోహలు తొలగించుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. కేఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.భవానీప్రసాద్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ భానుమూర్తి, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు తెలియజేయాలి

కర్నూలు కల్చరల్: సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి గోరంట్ల రమణ అన్నారు. ఉత్సవ సమితి, కర్నూలు సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని క్రైడో ది స్కూల్‌లో విద్యార్థులకు సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించారు. ముఖ్య వక్తగా రాష్ట్రీయ సేవిక సమితి ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ లలిత హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలకు నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి తరగతుల వారీగా ఆయా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల యాజమాన్యాన్ని ఉత్సవ సమితి ప్రతినిధులు సన్మానించారు.

5న మహమ్మద్ ప్రవక్త జయంతి



మాట్లాడుతున్న సయ్యద్ షఫీ పాషా ఖాద్రి

కర్నూలు (టౌన్): మహమ్మద్ ప్రవక్త జన్మించి 1500 సంవత్సరాలు అవుతున్నందున సెప్టెంబర్ 5న వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మిలాద్ కమిటీ వ్యవస్థాపకుడు సయ్యద్ షఫీ ఖాద్రీ తెలిపారు. ఆదివారం స్థానిక మిలాద్ మహల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లతీఫ్ లావుబా లి దర్గా నుంచి ఉదయం 8 గంటలకు ఊరేగింపుగా బయలుదేరి మిలాద్ చౌక్, రాజ్‌విహార్ సెంటర్ వరకు కోన సాగుతుందన్నారు. జెండా ఆవిష్కరణ, ప్రసంగాలు ఉంటాయన్నారు. అదే రోజు శుక్రవారం కావడంతో ఈ కార్యక్రమాలన్నీ మధ్యాహ్నం 12 గంటలకల్లా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జులూస్ కార్యక్రమంలో రాజకీయ నేతలు, కలెక్టర్, ఎస్పీ ఇతర విశిష్ట వ్యక్తులు పాల్గొంటారని తెలిపారు. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న పర్యావరణ సంరక్షణ విభాగ్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కనాటి పర్యావరణానికి తోడ్పడాలని రిటైర్డ్ డీఎఫ్ఓ బి.జయచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం పర్యావరణ సంరక్షణ విభాగ్ కర్నూలు ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ కాలేజీ వద్ద క్లస్టర్ యూనివర్సిటీ వెనుక మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన విశ్రాంత డీఎఫ్ఓ జయచంద్రారెడ్డి, కర్నూలు టెర్రస్ గార్డెనింగ్ నిపుణుడు తోట హరికృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో మొక్కలు నాటేందుకు అనువైన సమయమని పేర్కొన్నారు. కర్నూలు పర్యావరణ సంరక్షణ విభాగ్ నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు తమవంతు కృషి చేస్తోందన్నారు. శ్రీనివాస మందిరం ప్రసిడెంట్ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుధాకర్, డాక్టర్ రాజీసుధ, ఎల్లప్ప, లోకేశ్వర్‌రెడ్డి, హర్ష తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

టీడీఆర్ బాండ్లు పంపిణీ

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పరిధిలో నేషనల్ హైవే – 340 రహదారి విస్తరణలో స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్) బాండ్ల ప్రక్రియ ప్రారంభించినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. ఆదివారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో స్థల యజమానులకు టీడీఆర్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి ఎస్.ఎస్.గార్డెన్స్ వరకు మొత్తం 2.34 కిలోమీటర్ల పొడవున 210 ఆస్తులు ప్రభావితమవుతాయన్నారు. ముందస్తుగా ముగ్గురికి బాండ్లు అందిస్తున్నామని, త్వరలో మరో 40 మందికి బాండ్లు అందజేస్తామన్నారు. విస్తరణ పరిధిలో 159 మందికి నోటీసులు జారీ చేశామని, ఇందులో 110 మంది సమ్మతి పత్రాలు అందజేశారన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



స్థలాలు ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు అందిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

సామాజిక న్యాయంతోనే గిరిజనుల అభివృద్ధి

కర్నూలు(అర్బన్): పాలక ప్రభుత్వాలు పదవుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటిస్తే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ అన్నారు. నేటికి రాష్ట వ్యాప్తంగా అనేక గిరిజన కాలనీలు, చెంచు గూడేల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన గిరిజన నిరుద్యోగ యువతకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం కల్పించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో అర్హులైన గిరిజన నేతలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో గిరిజన సలహా మండలి సభ్యులుగా ఎన్నికైన వెంకటపతి సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీఎస్ఎఫ్ రాష్ట అధ్యక్షులు రాగిరి చంద్రప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కేఈ శ్యాంకుమార్, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామరాజు, పీ వెంకటేష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటపతి, ఎమ్మెల్యేలను సన్మానించిన గిరిజన నేతలు

సాంకేతిక సహకారానికి ఒప్పందం



ఎమ్ఓయూ పత్రాలను చూపుతున్న ఆర్‌యూ, క్విన్‌ఫోసిస్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం, క్విన్‌ఫోసిస్ మధ్య క్వాంటం సాంకేతికత అభివృద్ధికి అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ) కుదిరింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, క్విన్‌ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు సీఈఓ, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వల్లూరి మహేశ్వరరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు మాట్లాడుతూ.. క్వాంటం పరిశోధన, ఆవిష్కరణలో ఈ ఎమ్ఓయూ ఒక ముఖ్యమైన అడుగన్నారు. ఈ భాగస్వామ్యం పరిశోధన, అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామికత, ఆవిష్కరణ సహకారం, పరిశ్రమ సంబంధిత పాఠ్యక్రమ అభివృద్ధి సంయుక్త కార్యక్రమాల వంటి విభాగాల్లో కలిసి పనిచేయడంపై దృష్టి సారిస్తుందన్నారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ సి.విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(అర్బన్): రజకులు అన్ని రంగాల్లో ఎదగాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో రజక విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ఏడవ రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ దువ్వూరు రామారావు, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తమ మార్కులు సాధించిన 92 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలతో పాటు మెడల్, ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. రజకులకు కమ్యూనిటీ హాల్స్, దోబీఘాట్ల నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తామని బస్తిపాటి నాగరాజు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి మాట్లాడుతూ.. అనాదిగా సమాజంలో రజకుల పట్ల వివక్షత ఉందని, నేటికి అనేక గ్రామాల్లో రజకులు దుస్తులు శుభ్రం చేయకపోతే గ్రామ బహిష్కరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కంతోట రామక్రిష్ణ, జొన్నగిరి ఎస్‌ఐ మల్లికార్జున, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేష్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నగదు, ప్రశంసా పత్రాలు అందుకున్న రజక విద్యార్థులు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైన సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఎన్‌టీఆర్ రూపంలోని శ్రీకృష్ణుడి విగ్రహమా?

కర్నూలు(సెంట్రల్): గుంటూరు జిల్లా తెక్కెళ్లపల్లిలో ఎన్‌టీఆర్ రూపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహావిష్కరణను వెంటనే నిలుపుదల చేయాలని యాదవ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కన్వీనర్ శేషఫణి యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేరున నిర్మించిన విగ్రహం శ్రీకృష్ణుడి నమనాలో ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. వెంటనే ఆ విగ్రహావిష్కరణను నిలుపుదల చేయించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ వాదనను పట్టించుకోకుండా ముందుకు వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.అయ్యన్న యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక ఉపాధ్యాయురాలి మృతి

కర్నూలు సిటీ: నగర శివారులో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయురాలు ఇందిర చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. ఈమె కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. గత నెల 31న భర్తతో బైక్‌పై వెళుతుండగా జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా కుక్క అడ్డురావడంతో తప్పించే ప్రయత్నంలో భార్యభర్తలు కింద పడ్డారు. నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఇందిర తుదిశ్వాస విడిచారు. సమాచారం తెలుసుకున్న ఏపీటీఎఫ్ రాష్ట అధ్యక్షులు జి.హృదయరాజుతో పాటు, ఆ సంఘం నాయకులు మరియానందం, తదితరులు ఇందిరా పార్థివ దేహానికి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): వినాయక చవితి, నిమజ్జనం కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. పవర్‌హౌస్ సెక్షన్ పరిధిలోని పెద్ద మార్కెట్, కల్లా, సుబేదార్ స్ట్రీట్, సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలో అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వర నగర్, కృష్ణల నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): భద్రతలేని జీవనం గడుపుతున్న హమాలీల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ స్టేట్ వేర్‌హౌస్, ఎఫ్‌సీఐ అండ్ ప్రైవేట్ గోడౌన్స్ హమాలీ యూనియన్ సభ జరిగిది. శాఖ కార్యదర్శి చిన్న మద్దిలేటి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. హమాలీలు పని ప్రదేశంలో భద్రత లేకుండా చాలీచాలనీ జీతాలతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూటలు మోస్తూ 50 ఏళ్లకే మోకాళ్ల నొప్పులతో అనారోగ్యం బారిన పడుతున్నారని, వారి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అంతేకాక కనీస వేతనం, ఆరోగ్య భద్రతకు ఈఎస్‌ఐ, జీవిత భద్రతకు పీఎఫ్ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం 8 మందితో నూతన వేర్‌హౌస్ హమాలీ కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్.ఓబులేసు, కే.రాజు, సహాయ కార్యదర్శిగా ఆర్.మహేష్, ఉపాధ్యక్షులుగా హనుమంతు, ట్రెజరర్‌గా ఎం.శీను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయులు టి.రాముడు, ఆర్.నరసింహులు, సాయి బాబా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

రైల్వే వ్యాగన్‌కోచ్ పనులను పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీని వెంటనే పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆర్.రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తైనా యువతకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రధానంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పినా ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. కర్నూలులో ఓర్వకల్ ఇండస్ట్రీయల్ హబ్‌లో వేలాది మందికి ఉపాధిని కల్పిస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పుతున్నారే తప్పా ఉద్యోగాలు ఇవ్వడంలేదన్నారు. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు, పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీలను నిర్మించాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో కరువు విలయతాండవం చేస్తున్నా ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరోవైపు కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు శిరీష, మైన, హుస్సేన్ బాషా, సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.రామన్న

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

కర్నూలు (టౌన్): సైక్లింగ్ అలవాటు చేసుకొని శారీరక ధృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా సూచించారు. స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆయన సండేస్ ఆన్ సైక్లింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వాహన కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ స్థిరత్వానికి దోహదపడటం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని దీని వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబానికి మేలు చేస్తుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం గేటు నుంచి ఓల్డ్ కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్ మీదుగా రాజ్ విహార్‌కు, అక్కడి నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, కర్నూలు రెండవ పట్టణ సీఐ నాగరాజరావు, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌ను బట్టి పంటలు సాగు చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రాణించాలంటే రైతులు మార్కెట్ సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలని కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ ఒకే పంట సాగు చేయడం వల్ల ఉత్పాదకత పెరుగుతుందని.. అలాంటి సమయంలో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉండదన్నారు. నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందాలంటే సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. ఫార్మర్ పోర్టల్‌లో ధరలను చూసుకొని పంట దిగుబడులను మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. దేశీ కార్యక్రమ సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రవికిశోర్